



టిడ్కో ఇళ్లకు ఇదీ రోడ్డు

కళ తప్పిన ఇళ్లు



సారిపల్లిలో టిడ్కో ఇళ్ల చుట్టూ పొదలు

పట్టణాల్లోని పేద కుటుంబాలకు పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను తెరపైకి తెచ్చింది. ఆధునిక సాంకేతిక విధానంలో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో నిర్మాణం చేపట్టింది. పనులు వేగంగా జరుగుతున్న దశలో ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను కనీసం పట్టించుకోలేదు. ఎక్కడి పనులక్కడే వదిలేసింది. ఈ పరిస్థితిలో ఇళ్లలో చెదలు పెరిగి.. తుప్పు పట్టి.. గోడలు, స్లాబు దెబ్బతిన్నాయి. విజయనగరంలో లబ్ధిదారుల చేతికి ఇళ్లు అప్పగించినప్పటికీ మౌలిక వసతులు కల్పించ లేదు. రాజాం, నెల్లిమర్లలో ఎక్కడి పనులక్కడే నిలిచిపోయాయి. లబ్ధిదారులు కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు.

- వైసీపీ ప్రభుత్వ తీరుతో దయనీయంగా టిడ్కో గృహాలు
- రాజాం, నెల్లిమర్లలో ఎక్కడి పనులక్కడే
- విజయనగరంలో ఇళ్లు అప్పగించినా మౌలిక వసతులు మృగ్యం
- తప్పని బ్యాంక్ ఈఎంఐల భారం
- కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు

విజయనగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

ఇళ్లు కాదు.. ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తామని చెప్పుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలను మొక్కుబడిగా ఏర్పాటుచేసి వదిలేసింది. ఎక్కడా మౌలిక వసతులు కల్పించకుండా.. లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా వారిని అయోమయంలో పడేసింది. ఇటు టిడ్కో ఇళ్ల వైపు చూడా చూడకుండా పూర్తయిన ఇళ్లు లబ్ధిదారులకు దక్కనీయలేదు. అక్కడక్కడ జాబితా మార్చేసి లబ్ధిదారులకు ఇచ్చినా కనీస సౌకర్యాలు కల్పించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో 60 నుంచి 90 శాతం పనులు పూర్తిచేశారు. ఇంతలో 2019లో అధికార మార్పిడి జరిగింది. వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టిపెడుతుందని అంతా భావించారు కానీ అదిగో ఇదిగో



పక్కన పడేసిన డోర్లు, కిటికీలు

అంటూ కాలయాపన చేసి ఇళ్లు పాడయ్యేలా వ్యవహరించింది. మరోవైపు మౌలిక వసతులు కల్పించలేదు. కానీ వైసీపీ రంగులతో ఇళ్లను నింపేశారు. సరిగ్గా ఎన్నికలకు ముందు కొందరు లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించారు. అయితే మౌలిక వసతులు లేక ఆ ఇళ్లలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపలేదు. నేటికీ అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. బ్యాంకు రుణాలకు ఈఎంఐలు కడుతున్నారు.

రూ.40 కోట్లు పెండింగ్..

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.40 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. మరో రూ.89 కోట్లు మంజూరైతే కానీ భవనాల పనులు ముందుకు కదలవు. దీనిపై జిల్లా అధికారులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాతే టిడ్కో ఇళ్ల విషయంలో కదలిక వచ్చింది. అవసరమైన పనులను గుర్తించారు. వాటి కోసం రూ.58.50 కోట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. అయితే బ్యాంకు రుణాలతో అప్పట్లో టిడ్కో ఇళ్లను మంజూరు చేశారు. ఈ ఏడాది మార్చితో మారిటోరియం గడువు (మిగతా 8వ పేజీలో...)

విజయనగరంలో..

విజయనగరం నగరపాలక సంస్థకు సంబంధించి సారిపల్లిలో 2,880 ఇళ్లు మంజూరయ్యాయి. వివిధ కారణాలతో 2656 ఇళ్ల నిర్మాణ పనులు కొలిక్కివచ్చాయి. 82 బ్లాకుల్లో 32 ప్లాట్లలో 300 చదరపు అడుగుల ఇళ్లు 1536, 365 చదరపు అడుగుల ఇళ్లు 192, 430 చదరపు అడుగుల ఇళ్లు 928 ఉన్నాయి. కాగా తొలి ఫేజ్‌లో చేపట్టిన 2656 ఇళ్లను నాలుగు విడతల్లో అప్పగించారు. మరోవైపు సోనియా నగర్‌లో 1280 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 1120 ఇళ్ల పనులు పూర్తయ్యాయి. 300 చదరపు అడుగుల ఇళ్లు 480, 365 చదరపు అడుగుల ఇళ్లు 256, 430 చదరపు అడుగు ఇళ్లు 384 ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 91 శాతం పనులు పూర్తయ్యాయి. మౌలిక వసతులకల్పన పనులు 15 శాతం మాత్రమే జరిగాయి. గత ఐదు సంవత్సరాల్లో రహదారులు, కాలువలు, పాఠశాలలు, ఆస్పత్రులు వంటివి ఏవీ నిర్మించలేదు.

బొబ్బిలిలో..

బొబ్బిలి పట్టణానికి సంబంధించి రామన్నదొరవలస వద్ద టిడ్కో ఇళ్లను మంజూరు చేశారు. ఇక్కడ 35 బ్లాకుల్లో 1680 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 1200 గృహాలకు సంబంధించి లాటరీ తీసి లబ్ధిదారులకు అందజేశారు. అయితే ఇంతవరకూ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడంతో పరిస్థితి మరింత తీసికట్టుగా మారింది. ఒక ఏజెన్సీకి పనులు అప్పగించడం, బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో మౌలిక వసతులకు సంబంధించిన పనులు మధ్యలో నిలిచిపోయాయి.

రాజాం, నెల్లిమర్లలో..

రాజాం మునిసిపాల్టీకి సంబంధించి కంచరాంలో 336 ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. కానీ వివిధ కారణాలు చూపి పనులు ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వం థర్డ్ పార్టీగా చూపి ఒక ఏజెన్సీకి పనులు అప్పగించింది కాని ఏజెన్సీకి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ప్రారంభించలేదు. నెల్లిమర్ల నగర పంచాయతీలోనూ అదే పరిస్థితి. 576 ఇళ్లను మంజూరు చేశారు. సంబంధిత ఏజెన్సీ పనులు ప్రారంభించలేదు.



విజయనగరం: విద్యుత్ వెలుగుల్లో కంటోన్మెంట్ తెలుగు బాప్టిస్ట్ చర్చి

క్రిస్మస్ సంబరాలకు వేళ అయింది. ప్రార్థనలకు క్రైస్తవులంతా సిద్ధమయ్యారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. డీజేలతో ఏసు పాటలను ఆలపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా చర్చిల ప్రాంగణాల్లో ఏసు పుట్టుకను తెలియజేస్తూ ఆలోచింపజేసేలా సెట్‌లను తీర్చిదిద్దారు. వాస్తవానికి వారం రోజుల నుంచే సెమీ క్రిస్మస్ పేరుతో సంబరాలు మొదలైపోయాయి. మంగళవారం రాత్రి ఏసు పాటలు, వేషధారణలతో వాడవాడలా ర్యాలీలు చేశారు. విజయనగరంలోని స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, ఆర్‌సీఎం చర్చి, లూథరన్ చర్చిల్లో భారీ సంఖ్యలో ప్రార్థనలు చేపట్టారు. ఫాదర్‌లు క్రీస్తు జననం.. క్రిస్మస్ విశిష్టత గురించి తమ, తమ సందేశాల్లో వివరించారు.

- విజయనగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

జిల్లా ప్రజలకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అందరికీ అందించారు. జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాస్‌మూర్తి, బిషప్ సత్యరాజ్, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న కలెక్టర్

పరీక్ష ఫలితాలెక్కడ?

- రైతులకు అందని భూసార రిపోర్టులు
- సేకరణకే మట్టి నమూనాలు పరిమితం
- పంట దిగుబడులపై ప్రభావం
- మొక్కుబడిగా అగ్రిల్యాబ్‌ల నిర్వహణ
- గత ఐదేళ్లూ ఇదే పరిస్థితి

6లో

5, 8లో డిటెన్షన్

- గజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్రీయ, నవోదయ పాఠశాలల్లో అమలు
- రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ నిర్ణయాన్ని వదిలేసిన కేంద్రం
- ఉపాధ్యాయులు, విద్యావేత్తల్లో భిన్నాభిప్రాయాలు

6లో

ప్రాజెక్టులకు భూములిచ్చిన వారికి ప్రాధాన్యం

- గ్రామస్థుల సమక్షంలోనే సబ్ డివిజన్ చేయాలి
- కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాలు

డెంకాడ/ విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగులు భూమిని సంబంధిత రైతు పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశి ంచారు. డెంకాడ మండలం ముంగినాపల్లిలో మంగళ వారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వే భూముల సబ్ డివిజన్ అంశాలను విన్నవిం చారు. భూముల సబ్ డివిజన్‌కు సంబంధించిన సర్వే సమస్యలను గ్రామస్థుల సమక్షంలోనే పరిష్కరించాలని తహసీల్దార్‌లకు కలెక్టర్ సూచించారు. గ్రామంలోని పలువురు రైతులు అసైన్డ్ భూములు సాగు చేస్తున్నప్పటికీ వారి పేర్లు ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా నమోదు కానట్లు గుర్తించారు. దీనిపై స్పందిస్తూ అర్హులైన అసైన్డ్ భూముల సాగుదారులను గుర్తించేందుకు ఇద్దరు లేదా ముగ్గురు సర్వేయర్లతో కమిటీ వేసి, గ్రామంలోని అసైన్డ్ భూమిని ఎవరు సాగుచేస్తున్నారో వాస్తవంగా నిర్ధారించి వారికి పట్టాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామంలో అసైన్డ్‌దారుల జాబితాను చదివి వినిపించా లన్నారు. ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన రైతులకు సంబంధించి వారి నుంచి సేకరించిన భూవిస్తీర్ణం మినహాయించి సర్వే నెంబర్‌లోని మిగిలిన భూమిని సంబంధిత రైతు పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయిం చాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో పలువురు రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. సదస్సులో తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారంపై దృష్టి పెట్టాలి

రెవెన్యూ సదస్సుల్లో వినతులను స్వీకరించడమే కాకుండా వాటికి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. మంగళ వారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినతుల పరిష్కా రానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ విషయంలో జిల్లా వెనకబడి ఉంద న్నారు. ఇక నుంచి ప్రతి రోజు సాయంత్రం రెవెన్యూ సదస్సులపై సమీక్ష నిర్వహించాలని జేసీకి సూచించారు.



రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అంబేడ్కర్

వారంలో 1492 ఇళ్లు పూర్తి కావాలి

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే జనవరి మొదటి వారం నాటికి లక్ష ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని, జిల్లాలో నెలాఖరు నాటికి 4816 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారులుతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటికే 3,324 గృహాల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు.

వినియోగదారులూ హక్కులు తెలుసుకోండి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులంతా తమ హక్కులను తెలుసుకోవాలని జేసీ సేతు మాధవన్ అన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ సదస్సు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వినియోగదారుడే రాజు అని అన్నారు. వారు కొనుగోలు చేసే వస్తువులకు పూర్తిగా సంతృప్తి చెందాల్సి ఉందని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందే హక్కు ఉందని చెప్పారు. విక్రయించే వస్తువు గుర్తించి పూర్తి సమాచారాన్ని అందజేయాల్సిన బాధ్యత తయారీదారుడిపై ఉందని స్పష్టం చేశారు. వస్తువు పరిమాణం, నాణ్యత, శుద్ధత, సామర్థ్యం తప్పకుండా పరిశీలించాలన్నారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, న్యాయమూర్తి ఆర్.వెంకట్ నాగ సుందర్ మాట్లాడుతూ వినియోగదారల హక్కుల గురించి వివరించారు. 2019 వినియోగదారుల హక్కుల చట్టం వచ్చిన తరువాత వినియోగదారుడు వస్తుసేవలను ఎక్కడ కొనుగోలు చేసినా తాము నివాసం ఉన్న చోట న్యాయస్థానాన్ని ఆశ్రయించే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారులు కమిషన్ సభ్యురాలు భీశ్రీదేవి, డీఎస్‌వో మదుసూధన్‌రావు, సైబర్ క్రైమ్ ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వదులుకోవాల్సిందేనా?

- వరి కంకులకు మొలకలు
- నేటికీ వరద నీటిలో పెసర, మినప మొక్కలు
- వరుస తుఫాన్లతో పంటలకు నష్టం

శృంగవరపుకోట మండలం ముషిడిపల్లి గ్రామంలోని ఓ రైతు పొలంలో మొలకెత్తిన వరి కంకులివి. నాలుగు ఎకరాల్లో వేసిన వరి పంటకు వారంరోజుల క్రితం కోతలు చేపట్టాడు. నూర్పు పట్టాలని అనుకుంటున్నంతలోనే తుఫాన్ హెచ్చరిక వినిపించింది. వెంటనే వ్యవసాయ అధికారుల సూచనతో పొలంలో కుప్పలేశాడు. గురువారం నుంచి కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిచి మెలకెత్తుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు ధాన్యం తీసుకుంటాయో లేదోనని రైతు టెన్షన్ పడుతున్నాడు.



శృంగవరపుకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏ పొలంలో చూసినా నీరే కనిపిస్తోంది. వరి పంట కుప్పలుగా పేర్చినప్పటికీ కొంచెం కొంచెం నీరు చేరి వరి కంకులకు మొలకలు వచ్చేస్తున్నాయి. మరోవైపు పెసర, మినప మెక్కలు నీట మునిగాయి. చాలా మొక్కలు చనిపోతున్నాయి. వరితో లాభం ఎక్కువగా లేకపోయినా పెసర, మినప పంటలతో కాస్త ధీమాగా ఉండొచ్చునని రైతులు భావించారు. ఏ రకంగా కూడా కలిసి రావడం లేదు. వరి పంటకు ముందు నువ్వుపంట, వెనక పెసర, మినప బాగా పండితేనే రైతుకు ఊరట. నువ్వు పంట చేతికి వచ్చే సమయానికి ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో పంట ఇంటికి చేరడం అనుమానమే. పెసర, మినప పంట అలా కాదు. వరి కోతల సమయంలో తడిన్న పొలంలో నాటితే చాలు మొలక వస్తుంది. ఆ తరువాత నీటితో పనిలేదు. పంట చేతికిరావడం ఖాయం. అయితే ప్రస్తుతం పడుతున్న వర్షాలు వరి పంటతో పాటు పెసర, మినప పంటకు నష్టం తెస్తున్నాయి.

ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 97,397 హెక్టార్లలో వరి నాట్లు పడ్డాయి. వర్షాలు సక్రమంగా పడక ముందు, వెనక ఉబాలు జరిగాయి. అయినప్పటికీ ఆశాజనకంగా పంట పండింది. దీంతో రైతు సంబర పడ్డాడు. నవంబరు నెలాఖరు నుంచి వరి కోతలు చేపట్టాడు. అప్పుడే తుఫాన్‌లు కూడా మొదలయ్యాయి. దీంతో కోతలను ఆపేసి, పూర్తయిన కంకెలను కుప్పలుగా పెట్టారు. ఆ తర్వాత నూర్పు చేపట్టి సొంతానికి కొంత ధాన్యం వుంచుకుని మిగిలిన ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. కూటమి ప్రభుత్వం కూడా అమ్మిన ధాన్యానికి రెండు మూడు రోజుల్లోనే చెల్లింపులు చేసేస్తున్నారు. అంతా (మిగతా 8వ పేజీలో...)

వేపాడ మండలం బొద్దాం పంచాయతీ శివారు కొత్తబొద్దాం గ్రామ సమీపంలోని పొలాల్లో ఏపుగా పెరిగిన పెసర, మినప మొక్కలివి. పక్కపక్క పొలంలో పోటీపడి పెరిగాయి. తుఫాన్ వర్షాలకు నీట మునిగాయి. నీటిని బయటకు పంపించేందుకు రైతులు ప్రయత్నిస్తున్నప్పటికీ రోజూ పడుతున్న వర్షంతో పైపొలాల నుంచి వరద నీటి ప్రవాహం తగ్గడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



క్రిస్మస్ సందడి

- విద్యుత్ దీపాలంకరణలో చర్చిలు
- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

బొబ్బిలి/ రాజాం రూరల్/గజపతినగరం/ సంతకవిటి/ సాలూరు/ రూరల్/ వీరఘట్టం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయి. రంగుల విద్యుత్ దీపాలంకరణతో చర్చిలను సర్వాంగ సుంద రంగా తీర్చిదిద్దారు. ఈమేరకు మంగళవారం పలు ప్రార్థనా మందిరాల్లో వేడుకలు నిర్వహించారు. క్రీస్తు సందేశాలను ఆయా పాస్టర్లు వినిపించారు. క్యాండిల్స్ వెలిగించి, కేక్‌లు కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు క్రీస్తు జననం, మరియమ్మ, పశువుల కాపరి, శాంతాక్లాజ్, హలలూయ, వేషధారణలలో చిన్నారులు అలరించారు. పాటలు, నృత్యాలతో సందడి చేశారు.


సాలూరు రూరల్:శిలువ ఊరేగింపు


రాజాం రూరల్: వివిధ వేషధారణలో విద్యార్థులు


వీరఘట్టం: విద్యుత్ కాంతుల్లో ఓ చర్చి


పాలకొండ ఆర్‌సీఎం చర్చి ఇలా..


బొబ్బిలి: మహారాణిపేట లూథరన్ చర్చిలో..


సాలూరు: లూథరన్ చర్చి ఇలా..


రాజాం: వేషధారణల్లో చిన్నారులు


గజపతినగరం: సంతతోట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


విజయనగరంలో ఓ చర్చి ఇలా..

5,8 తరగతులకు డిటెన్షన్

- గజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్రీయ, నవోదయ పాఠశాలల్లో అమలు
- రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ నిర్ణయాన్ని వదిలేసిన కేంద్రం
- ఉపాధ్యాయులు, విద్యావేత్తల్లో భిన్నాభిప్రాయాలు



బొబ్బిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నూతన విద్యా విధానంలో సవరణలు చేస్తూ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలకు వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేసింది.. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని విద్యాసంస్థల విషయంలో నిర్ణయాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలి వేసింది.

1972 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బ్రహ్మానందరెడ్డి ఉన్నప్పుడు పదోతరగతి వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించకూడదనే నిర్ణయం తీసుకున్నారు. నాటినుంచి నేటి వరకు ఇదే విధానం అమలవుతోంది. ప్రతీ ఒక్కరూ అక్షరాస్యులు కావాలని, పరీక్షల ఫెయిల్ పేరుతో విద్యార్థులెవరూ బడి మానేయడానికి వీలు లేకుండా నో డిటెన్షన్ విధానాన్ని అమలు చేశారు. మళ్లీ అర్థ శతాబ్దం తరువాత నో డిటెన్షన్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లోప భూయిష్టమైన నో డిటెన్షన్‌ను రద్దు చేయడమే మేలు అని ప్రభుత్వం తలంచింది. అయితే డిటెన్షన్ విధానంలో కూడా అనేక తప్పుల కుప్పలు ఉన్నాయని, పగడ్బందీగా అమలు చేయని ఏ విధానమైనా వ్యర్థమేనని పలువురు తల్లిదండ్రులు, ఉపాధ్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

1972కి ముందు, ఆ తరువాత విద్యావిధానం తీరును చాలామంది పోల్చి చెబుతున్నారు. అప్పట్లో ఒకటి, రెండు తరగతులు చదువుకునే వారిలో ఎంతో ప్రతిభ, అక్షరజ్ఞానం చదువరితనం, డ్రాఫ్టింగ్ స్కిల్స్, అందమైన దస్తూరి వంటివి ఉండేవని, ఇప్పుడు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు చాలామందికి చదవడం, రాయడం రాని దుస్థితి నెలకొని ఉంది. డిటెన్షన్ విధానాన్ని మళ్లీ అమలు చేస్తే అది పక్కాగా ఉండాలన్న డిమాండ్ ఉంది. మాల్ ప్రాక్టీస్ చేయించి విద్యార్థులను పైతరగతులకు పంపించేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండబోదని, నాణ్యమైన విద్యతో విద్యార్థులు రాణించేలా పగడ్బందీ విధానం ఉండాలన్న వాదన వినిపిస్తోంది. ఇందుకు ప్రభుత్వ విధానం ఒక్కటే సరిపోదని, విద్యార్థుల తల్లిదండ్రుల సంపూర్ణ సహకారం తప్పనిసరి అని చెబుతున్నారు.

నో డిటెన్షన్ స్వాగతించదగ్గదే..

50 సంవత్సరాలు దాటిన తరువాత నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయడం స్వాగతించదగ్గదే. కేంద్రం బాటలోనే రాష్ట్రాలు కూడా నడవాలి. గతంలో అతి తక్కువ తరగతులు చదువుకున్న వారిలో సైతం అనేక రకాల ప్రతిభాపాటవాలు ఉండేవి. అక్షర జ్ఞానం చాలా మెండుగా ఉండేది. ఇప్పుడు ఎంత చదివినా లోపాల పుట్టగానే ఉంది. నాణ్యమైన విద్య సమాజానికి అందేలా ప్రభుత్వ విధానం ఉండాలి. టెన్త్ వరకు ఎటువంటి పబ్లిక్ పరీక్షలు లేకుండా అలా వెళ్లిపోతుంటే విద్యార్థులతో విద్యాపరంగా రాణింపు ప్రశ్నార్థకంగా ఉంటోంది. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షించి వాటిని మెరుగుపరిచే విధానం కచ్చితంగా ఉండాలి. మాల్‌ప్రాక్టీస్ భూతాన్ని తరిమికొట్టాలి. నో డిటెన్షన్ విధానంలో విద్యార్థి సర్టిఫికేట్‌లో పాస్డ్ అని కాకుండా ప్రమోటెడ్ అని ఉంటుంది. అటెండెన్స్ ఒక్కటే ప్రాతిపదిక కారాదు.

-గురిజాపు వెంకటరమణ, హెచ్ఎం, జడ్పీ ఉన్నత పాఠశాల, జగ్గునాయుడుపేట

కష్టపడి చదివి ఉత్తీర్ణులైన వారికి గౌరవం..

అటెండెన్స్ ప్రాతిపదికన విద్యార్థులను పై తరగతులకు పంపించే విధానం చాలా అనుచితం. దీనివల్ల ఆ విద్యార్థి భవిష్యత్‌కు ఎటువంటి దోహదపడదు. లిటరసీ శాతం పెరగాలన్న లక్ష్యంతో నాణ్యతకు తిలోదకాలివ్వకూడదు. తల్లిదండ్రుల సహకారం చాలా అవసరం. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు ఇచ్చే సలహాలు, సూచనలు, ప్రోత్సాహానికి తల్లిదండ్రులు బేషరతుగా మద్దతు పలకాలి. హైస్కూల్ స్థాయిలో ఇంకా అనేక మందికి అక్షరాలు నేర్పాల్సిన దుస్థితి నెలకొనడం దురదృష్టకరం. ఉపాధ్యాయ లోకంలో ఈ తరహా అసంతృప్తి పుష్కలంగా ఉంది.

-గంట సత్యనారాయణ, ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, రేజేరు

సమాజానికి హితమే..

నో డిటెన్షన్ విధానం రద్దు చేయడం సమాజానికి హితకరమే. దీనివల్ల విద్యలో నాణ్యత పెరుగుతుంది. దేశానికి మంచి పౌరులను అందించేందుకు దోహదపడుతుంది. ఏదో మొక్కుబడి చదువుల వల్ల ప్రయోజనం ఉండబోదు. విద్యార్థుల ప్రాథమిక విద్య పునాదులు చాలా గట్టిగా ఉండాల్సిందే. నైతికత, మానవీయత, సభ్యసంస్కారం వంటి లక్షణాలు సమాజంలో కొరవడుతున్నాయన్న బాధ అందరిలోనూ ఉంది. దీనికి కాయకల్ప చికిత్స చాలా అవసరం.

-ఎంసీహెచ్ గౌరునాయుడు, మేథ్స్ టీచర్, జడ్పీ హైస్కూల్, గొల్లాది

రద్దుకు వ్యతిరేకం..

విద్యావిధానానికి సంబంధించి నిర్దిష్టమైన పద్ధతులు ఏవీ లేకుండా చేస్తున్నారు. నూతన విద్యావిధానానికి దశ, దిశ లేదు. దీనిని రద్దు చేయాలన్న డిమాండ్‌ను పాలకులు పెడచెవిన పెడుతున్నారు. నో డిటెన్షన్ విధానం రద్దుకు మేము వ్యతిరేకం. ఎందుకంటే బడిబయట పిల్లలెవరూ ఉండకూడదన్న మౌలిక సూత్రానికి ఇది గొడ్డలిపెట్టు. సంస్కరణల పేరుతో విద్య మౌలిక లక్ష్యాలకు పాలకులు తమ సొంత అజెండాతో దెబ్బతీస్తున్నారు. ఒక్క నో డిటెన్షన్ విధానంతో సరిపెట్టుకుంటే కుదరదు. దేశవ్యాప్తంగా అనేకమంది మేధావులు, విద్యావేత్తలు, అనుభవశీలురు చేస్తున్న ప్రతిపాదనలను విద్యావిధానంలో చొప్పించిన నాడే మంచి ఫలితాలను సాధించగలుగుతాం.

-కె.విజయగౌరి, ఉపాధ్యాయిని

పరీక్ష ఫలితాలెక్కడ?

వరి దిగుబడి ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటోంది. పక్కపక్క పంట పొలాల్లో కూడా భారీగా తేడా వస్తోంది. ఎందుకిలా జరి గింది? అనేది రైతులకు తెలియడం లేదు. అందరూ ఒకేసారి, ఒకే పద్ధతిలో నాట్లు వేసినా దిగుబడిలో హెచ్చు తగ్గులు ఎందుకు వస్తున్నాయో తెలి యక అయోమయంలో పడుతున్నారు. కారణం చెప్పాల్సిన అధికారులు నోరువిప్పడం లేదు. మరి మట్టి నమూనా పరీక్షల సంగతేంటి.. అగ్రిల్యాబ్‌లు ఎందుకున్నట్లు.. అని రైతులు ప్రశ్నిస్తున్నారు.



- రైతులకు అందని భూసార రిపోర్టులు
- మట్టి నమూనాల సేకరణకే పరిమితం
- పంట దిగుబడులపై ప్రభావం
- మొక్కుబడిగా అగ్రిల్యాబ్‌ల నిర్వహణ
- గత ఐదేళ్లూ ఇదే పరిస్థితి

విజయనగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వరికోతలు చివరి దశకు చేరుకున్నాయి. దాదాపు పూర్తి కావొచ్చాయి. దిగుబడి విషయానికొస్తే కొన్ని ప్రాంతాల్లో ఎకరా పొలంలో 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మరి కొన్ని ప్రాంతాల్లో 25 క్వింటాళ్ల వరకూ నమోదైంది. అధికార యంత్రాంగం మాత్రం 28 క్వింటాళ్లు దాటుతోందని చెబుతుండటం విశేషం. ఈ హెచ్చుతగ్గులను అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. జిల్లా మొత్తం ఒకటేనన్నట్టు వ్యవహరిస్తున్నారు. అయితే మట్టి పరీ క్షలు చేసి అందుకనుగుణంగా అధికారులు సూచనలు ఇస్తే దిగుబ డిలో పెద్దగా తారతమ్యం ఉండదని రైతు లు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో భూసార పరీక్షలు చేయాలి. మట్టి నమూనాలు సేకరించాలి. అగ్రిల్యాబ్‌కు తరలించి పరీక్షలు చేయాలి. అందుకు అనుగుణంగా నివేదికలు ఇవ్వాలి. ఇది జరిగితే విత్తనాలు ఎంపిక మారుతుంది. ఎరువులు, రసాయనాల వినియోగం, సస్యర క్షణ వంటి విషయాల్లో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుంది. ఈ ప్రక్రియంతా బాగానే జరుగుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. క్షేత్రస్థాయిలో చూస్తే ఆ ఫలితం కనిపించడం లేదు. దిగుబడుల్లో తారతమ్యం కనిపిస్తోంది.

గణాంకాలతో సరిపెట్టేస్తున్నారు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సచివాలయంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడే వ్యవసాయ కార్యదర్శిని, పశుసంవర్థక శాఖకు సంబంధించి సిబ్బందిని నియమించారు. నియోజక వర్గానికి ఒక అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. భూసారం ఎలా ఉంది.. నేల ఏ తరహా పంటలకు అనుకూలం.. ఎంతమేర ఎరువులు వాడితే సరిపోతుందనే విషయాన్ని తెలుసుకోవడానికి మట్టి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. వెనువెంటనే నివేదికలు అందించాలి. అయితే ఈ ప్రక్రియ మట్టి నమూనాల సేకరణ వరకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. జిల్లాలో 3,34,567 ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉంది. 2022-23లో 32,580 భూసార పరీక్షలు నిర్వహించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 లో అయితే 43,612 పరీక్షలు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. పాడి పశువుల సీజనల్ వ్యాధులకు సంబంధించి 5.50 లక్షలు, గొర్రెలు, మేకలకు సంబంధించి 7.20 లక్షల పరీక్షలు జరిగినట్టు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పంటల దిగుబడులు మెరుగుపడడం లేదు. అటు మూగజీవాల వ్యాధులు నియంత్రణలోకి రాలేదు.

అగ్రి ల్యాబ్‌లు ఉన్నా..

వైసీపీ హయాంలో జిల్లా కేంద్రంలో భారీ అగ్రిల్యాబ్ ఏర్పాటు చేశారు. ఎస్.కోట, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, రాజాంలో సైతం అగ్రిల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో రైతుల పొలాల్లో మట్టిని సేకరించాలి. వాటి నమూనాలను జిల్లా కేంద్రంలో అగ్రి ల్యాబ్‌కు తరలించాలి. అక్కడ పరీక్షలు చేసి రైతులకు ఒక కార్డు అందిస్తారు. అటు నేరుగా నివేదికలు రైతు భరోసా కేంద్రాలకు వెళతాయి. అప్పుడే రైతులు వచ్చి ఏ రకం విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు. కానీ గత ఐదేళ్లలో ఇలా ఎప్పుడూ చేయలేదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరిని తెగుళ్లు దెబ్బతీశాయి. పగటిపూట కనిపించని పురుగులు.. రాత్రిపూట పంటపై దాడి చేశాయి. పురుగు వాలిన వెంటనే ధాన్యం గింజలు రాలిపోవడం ప్రారంభమైంది. దీంతో రైతులకు అపార నష్టం కలిగింది. దాని ప్రభావంతోనే దిగుబడి గణనీయంగా తగ్గిందంటున్నారు. మట్టినమూనాల సేకరణ, పరీక్ష సవ్యంగా జరగలేదని రైతులంటున్నారు.

మళ్లీ ముసురు

- జిల్లా అంతటా మేఘావృతం
- వణికిస్తున్న చలిపులి
- అక్కడక్కడా వర్షాలు
- పంట సంరక్షణకు అన్నదాత అగచాట్లు
- ఇప్పటికే కురిసిన వర్షానికి ధాన్యం మొలక
- కూరగాయల పంటలకూ నష్టం


సాలూరు రూరల్: బట్టివలసలో మొలకలు వచ్చిన వరిని చూపుతున్న రైతు


వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

భామిని/సాలూరు రూరల్/ వీరఘట్టం/ పార్వతీపురం రూరల్/ పార్వతీపురం టౌన్/ సీతానగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో జిల్లా అంతటా మళ్లీ మబ్బుల వాతావరణం నెలకొంది. ప్రజలను చలి పులి చంపేస్తోంది. అక్కడక్కడా వర్షాలు కురిశాయి. ఇప్పటికే కురిసిన వర్షాలకు వరి పంట నీట మునిగింది. రెండు రోజులు తెరిపివ్వడంతో అక్కడక్కడ కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు ఆదరాబాదరాగా జాగ్రత్త చేసుకున్నారు. కొన్నిచోట్ల వరి కంకులకు మొలకలు వచ్చాయి. ఈనేపథ్యంలో మళ్లీ ముసురు, చిరుజల్లులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వాతావరణంతో మార్పులకు కూరగాయల పంటలకూ నష్టం జరగుతోంది.


పార్వతీపురం రూరల్ : కురుస్తున్న వర్షం


సీతానగరం: రహదారిపై ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు, గడ్డి కప్పిన దృశ్యం


పార్వతీపురం టౌన్ : వర్షం, చలి తీవ్రతతో నిర్మానుష్యంగా జిల్లా కేంద్రం


లారీలోకి చెరకును లోడింగ్ చేస్తున్న కళాసీలు

న్యూస్ బాక్స్

గ్రీన్‌ఫీల్డ్ బాధితులకు ఇళ్ల స్థలాలివ్వండి

కొత్తవలస, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా ఇళ్లను కోల్పోయిన వారికి నష్ట పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు కోరారు. మంగళవారం ఉత్తరాపల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా ఎక్కువగా నష్టపోయిన గ్రామం ఉత్తరాపల్లేనన్నారు. భూములు కోల్పోయిన రైతులకు సక్రమంగా నష్ట పరిహారం అంద లేదన్నారు. ఇళ్లను కోల్పోయిన వారికి కంటి తుడుపుగా నష్ట పరిహారం ఇస్తామంటున్నారన్నారు. నష్టపోయిన వారందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు అంబేడ్కర్ జంక్షన్‌లోని బాబాసాహెబ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కె.సోములు, ఎ.శివప్రసాద్, గౌరి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

నెల్లిమర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల చులకనగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం మండలంలోని గుషినిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బంకపల్లి దిలీప్, వై.త్రినాథ్, బి.మనోహర్, శివ తదితరులు పాల్గొన్నారు.

171 ఎకరాల్లో పంటలకు నష్టం

విజయనగరం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గత నాలుగైదు రోజులుగా విజయనగరం మండల పరిధిలో కురుస్తున్న వర్షానికి గాను 171 ఎకరాల్లో వరి, పెసర, మినుము పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక నివేదికను మండల వ్యవసాయ శాఖ సిబ్బంది సిద్ధం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు నివేదిక అడిగిన వెంటనే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. వరి 84 ఎకరాలు, మినుములు 75 ఎకరాలు, పెసరకు 12 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. అకాల వర్షం కారణంగా విజయనగరం మండల పరిధిలోని 13 గ్రామాల పరిధిలో వరి పంట, మినుములు, పెసలు దెబ్బతిన్నాయి.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు



పల్లకీ సేవలో పాల్గొన్న మహిళలు

జామి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భీమసింగి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం గోదాదేవి అమ్మవారిని పల్లకిలో మహిళలు ఊరేగించారు.

స్కేటింగ్‌లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన బి.కె.శరణ్య, రోహిత్ రెడ్డి

భోగాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ పోటీల్లో బొల్లింకలపాలేనికి చెందిన అక్కా, తమ్ముళ్లు బొల్లింకల కార్తీక శరణ్య, బొల్లింకల లోహితరెడ్డి బంగారు పతకాలు సాధించారు. కోయంబత్తూరులో ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు 62వ రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వీరిద్దరూ ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించారు. వీరిద్దరు ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో 73 పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్నారని వీరి తండ్రి అప్పన్నరెడ్డి తెలిపారు.

బెల్టుషాపులపై కఠినంగా వ్యవహరించండి: ఎస్పీ



పోలీసుల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టుషాపులపై నిఘా పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాబాల్లో మద్యం సరఫరా జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా మద్యం సరఫరా చేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాన వ్యాపారులను నిందితులుగా చేర్చాలన్నారు. రాత్రి పూట పెట్రోలింగ్ మరింత విస్తృతం చేయాలని, నేరాలు ఈవ్ టీజింగ్‌కు అవకాశం ఉన్న ప్రాంతాలు, రద్దీగా ఉండే వ్యాపార కూడళ్లు, బ్యాంకులు, కళాశాలల వద్ద గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మిస్సింగ్, మహిళలపై దాడుల కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాత్రి 11 గంటల తరువాత కారణం లేకుండా తిరిగే వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. గంజాయి, చోరీలు నియంత్రించడంలోనూ, లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు ఎం శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, న్యాయ సలహాదారులు పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి నెల్లిమర్ల సమస్యలు



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మంగళవారం తెలిపారు. ముఖ్యమంత్రిని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలు, రాజకీయ పరిస్థితులను వివరించానన్నారు. ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు రావలసిన పరిహారం గురించి చర్చించానని తెలిపారు. ఇటీవల తుపాన్ కారణంగా రైతన్నలకు జరిగిన నష్టాన్ని వివరించానని బంగార్రాజు చెప్పారు.

వైసీపీ నుంచి జనసేనలోకి...



ఎమ్మెల్యే నాగమాధవికి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

భోగాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో నెల్లిమర్ల మండలం బుచ్చన్నపేట గ్రామంలోని వైసీపీకి చెందిన టి.విజయలక్ష్మితో పాటు మరికొన్ని కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పనితీరు, జనసేన పార్టీ సిద్ధాంతాలు, నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి అనేకమంది జనసేన పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రజలకు నచ్చేవిధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ముక్కాం గ్రామానికి చెందిన మత్స్యకారులు, యాదవుల సమస్యలను మంగళవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో రెవెన్యూ, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వీటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

టిక్కెట్ ధర తగ్గించాలి

నెల్లిమర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో నిత్య కల్యాణం టిక్కెట్ ధర తగ్గించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతి ప్రసాద్‌లు ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఒకేసారి రూ.1500కు టిక్కెట్ ధర పెంచారని, దీంతో భక్తులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని వివరించారు.

చట్టబద్ధంగానే పదోన్నతులు

నెల్లిమర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంగానే తాము జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి పొందుతున్నామని, దొడ్డిదారిన పొందడంలేదన్న విషయాన్ని ఫోర్ట్, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలుసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీవీఎస్పీ జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. నియామకాల్లో పది శాతం పోస్టులలోనే తమకు పదోన్నతి అవకాశం కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. తమ పదోన్నతులను వ్యతిరేకిస్తూ ఫోర్ట్ అసోసియేషన్, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ చేస్తున్న నిరసనలను తాము ఖండిస్తున్నట్లు తెలిపారు.

పశువుల శాలలను త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒమ్మి, శ్యాంపురం, ఎంజేవలస, జీహెచ్‌పల్లి గ్రామాల్లో మంజూరైన పశువుల శాలలు సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓలు, టీసీలు, టీఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు గ్రామాలకు 13 పశువులు షెడ్లు మంజూరయ్యాయని, ఇంతవరకు 11 షెడ్ల పనులు ప్రారంభించారని తెలిపారు. వాటిని వారం రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో 100 రోజులకు తగ్గకుండా పని దినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటలు



రేగిడి:మునకలవలసలో దెబ్బతిన్న పెసర పంట

రేగిడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వానలకు వలస గ్రామాల్లో అపరాల పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మునకలవలస, బాలికావలస, కొర్లవలస, పనసలవలస, పారంపేట, బూరాడ గ్రామాల్లో మినుము, పెసర, జొన్న విరివిగా సాగుచేస్తారు. ఈ ఏడాది సరిగ్గా డిసెంబరులో వర్షాలు కురువడంతో పెసర పంటకు ఎక్కువ నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల్లో దాదాపు 50 నుంచి వంద ఎకరాల వరకు అపరాల పంటకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

వర్షాలతో నష్టం

సంతకవిటి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. విజయనగరం జిల్లాలోనే అత్యధికంగా వరి పండించే మండలాల్లో సంతకవిటి ప్రథమ స్థానంలో ఉంది. దాదాపు 40 వేల మెట్రిక్ టన్నుల వరకు వరి దిగుబడి ఉంటుంది. మండలంలో చాలా వరకు వరి కుప్పలు పొలాల్లో ఉండడంతో తుపాన్ ధాటికి తడిసిపోయాయి. అనేక గ్రామాల్లో మొలకలు వచ్చాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

డెంకాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను మంగళవారం వ్యవసాయ శాఖ సిబ్బంది, శాస్త్రవేత్తల బృందం చొల్లంగిపేటలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. త్వరితగతిన కోలుకోవడానికి రైతులు తప్పనిసరిగా వర్షం నీటిని బయటకు పంపించే విధంగా బాటలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.లక్ష్మణరావు, ఎ.నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, సర్పంచ్ కోరాడ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి

దత్తిరాజేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపురం గ్రామంలో పెసర, మినప, మొక్కజొన్న పంటలకు సంబంధించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి పి.అనూరాధ అవగాహన కల్పించారు. పంటల బీమా చేయించుకుంటే రైతుకు ఉపయోగం ఉంటుందన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కె.ఎ. నాయుడు

గజపతినగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు అన్నారు.. మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మునాయుడు స్వగృహంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతోఓ వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. పంట చేతికి వచ్చిన సమయానికి వాన పాలు కావడం దురదృష్టకరమన్నారు. రైతులను అన్ని విదాలుగా ఆదుకోనే ప్రయత్నాలు చంద్రబాబు చేపడుతున్నట్లు తెలిపారు. చెస్‌లో నారా దేవాన్ష్ వరల్డ్ రికార్డు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి మాజీ జెడ్పీటీసీ బి.బాలాజీ, ఆసుపత్రి మాజీ చైర్మన్ మిత్తిరెడ్డి రమణ, గోపి పాల్గొన్నారు.

27న విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా

చీపురుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా విద్యుత్ కార్యాలయాల వద్ద ఈ నెల 27న ధర్నా నిర్వహించనున్నట్టు వైసీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు, నాయకులు అనంతం, వరహాలనాయుడు, వంశీకృష్ణ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీటీసీ మణికుమార్

నెల్లిమర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత అనేది అందరి బాధ్యతగా గుర్తెరగాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణికుమార్ అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సీఎస్ఆర్ (కల్చరల్, స్పోర్ట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగాఇఇ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలను పరిమిత వేగంతో నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, సీఎస్ఆర్ కోఆర్డినేటర్లు శ్రావణి, ఆలన, జోగినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాంబాబు(ఫైల్)

బొబ్బిలి/గుర్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలం గొలగాం గ్రామానికి చెందిన నడిమివలస రాంబాబు అనే యువకుడు బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి తమ బంధువుల ఇంట్లో ఫంక్షన్ కోసం స్కూటీపై వచ్చాడు. మధ్యాహ్నం భోజనాల తర్వాత తమ బంధువులను బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు స్కూటీపై తీసుకెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి ఇందిరమ్మ కాలనీకి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాంబాబును బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి, అక్కడ నుంచి విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాంబాబు మంగళవారం కన్నుమూశాడు. మృతుడికి తల్లిదండ్రులు ఉన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

విజయనగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, కోరుకొండ రైల్వేస్టేషన్ల మధ్య సారిక గ్రామం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మహిళ మృత దేహం ఉన్నట్లు జీఆర్పీ ఎస్ఐ వి.బాలజీరావు మంగళవారం తెలిపారు. మృతిరాలికి 25 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉంటుంద న్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

112 మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తి నుంచి మంగళవారం 112 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఆంద్ర ఎస్ఐ సీతారాం తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం...



నిందితుడితో పోలీసులు

గుర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోటగండ్రేడు గ్రామం వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్ల ఎస్ఐ నారాయణరావు పట్టుకున్నారు. ఒక గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా 300 మద్యం సీసాలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

విజయనగరం టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులకు మంజూరైన బిల్లులు చెల్లించాలని, దీనికోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. జడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 1 నుంచి 7వ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టం వివరాలు, దానికి తీసుకుంటున్న చర్యలు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. వర్షానికి తడిసిన పంట నష్టానికి బీమా వర్తిస్తుందా? అని ప్రశ్నించారు. వరి, మొక్కజొన్న, పెసర, మినప పంటలకు ఈ నెలాఖరు వరకు బీమా చెల్లించవచ్చని అధికారులు వివరించారు. కొత్తపింఛన్ల మంజూరుకు, 50 ఏళ్ల దాటిన వారికి పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి వివరించారు. పంట తడిసిపోకుండా టార్పాలిన్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ టి.వెంకటేశ్వరావు, డిప్యూటీ చైర్మన్లు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలు రద్దు చేయాలి

చీపురుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ పంపిణీకి వినియోగిస్తున్న వాహనాలను తక్షణమే రద్దు చేయాలని, తద్వారా బియ్యం అక్రమ రవాణాను అరికట్టవచ్చునని తాను బోర్డు సమావేశంలో సూచించినట్టు కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు తెలిపారు. సోమ, మంగళవారాల్లో విజయవాడలో జరిగిన బోర్డు సమావేశంలో తాను పలు సూచనలు చేశానన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లులు, కొనుగోలు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరానన్నారు. సమావేశానికి కనీసం వారం రోజులు ముందుగా అజెండా కాపీలను సభ్యులకు పంపించాలని సూచించానని గద్దే తెలిపారు. ధాన్యంలో మట్టి, తేమ అధికంగా ఉంటున్నాయని, వీటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరానన్నారు.

టూరిజం సమావేశంలో సుధారాణి

శృంగవరపుకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగిన రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ అభివృద్ధి సమావేశానికి డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి హాజరయ్యారు. చైర్మన్ నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో పర్యాటక అభివృద్ధికి తీర్మానాలు చేశామన్నారు. సీఎం చంద్రబాబు కృషికి ధన్యవాదాలు తెలిపామన్నారు. హరిత పేరుతో ఉన్న టూరిజం హోటల్స్‌కు పున్నమి పేరు పెడుతున్నామని వివరిం చారు.

వక్తృత్వ పోటీల్లో అరవింద్‌కు బహుమతి

వేపాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరంలోని సంస్కృత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వక్తృత్వ పోటీలలో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థి మైచర్ల అరవింద్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

హామీలు నిలబెట్టుకోవాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ధర్మపురిలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న వైసీపీ పోరుబాట అనే కార్యక్రమం చేపడుతోందన్నారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలపై ఏకంగా 15,485 కోట్లను కరెంటు చార్జీల రూపంలో భారం మోపారని తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు నెక్కల నాయుడు బాబు, ఎస్‌వీవీ రాజేష్, ఆశపు వేణు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు షాకిస్తోంది

కొత్తవలస, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొత్తవలసలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా ఈ నెల 27న ఎస్.కోట దేవీ గుడి సమీపంలో వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, మచ్చ రామస్వామి, బూసాల దేముడు, మదిన అప్పలరాము, పల్లా భీష్మ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

రాజాం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై మంగళవారం వైసీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలే రాజేష్, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు. ఎంపీపీ లావేటి సులోచన, పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షులు లావేటి రాజగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ చైర్మన్‌గా ప్రతాప్


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతాప్

పాలకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్మన్‌గా పల్లా ప్రతాప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చైర్‌పర్సన్‌గా ఉన్న యందవ రాధాకుమారి ఇటీవల వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. దీంతో చైర్మన్ పదవికి ప్రతాప్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కె.కన్నబాబు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు.. ప్రతాప్‌కు అందించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రావు.. ఎమ్మెల్యే జయకృష్ణ, టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ● ఈసందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణను పల్లా ప్రతాప్‌తో పాటు పల్లా కొండలరావు కలిసి, సత్కరించారు. నగర పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపించాలని, పాలకొండకు ప్రత్యేక నిధులతో మోడల్ హబ్‌గా చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చేందుకు చర్యలు

గరుగుబిల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు తెలిపారు. కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సౌమిత్రి సర్వే కార్యాలయాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు రీసర్వే చేసిన మాదిరిగానే గ్రామాల్లో గ్రామ కంఠంలో నిర్మించుకున్న వారికి హక్కు పత్రాలు మంజూరు చేస్తామని తెలిపారు. రీసర్వే పూర్తయిన తదుపరి ఇంటికి సంబంధించి హక్కు పత్రాలను అందిస్తారని తెలిపారు. ఈ సర్వేలో కార్యదర్శులు సీహెచ్‌వీ కూర్మినాయుడు, ఎ.ప్రసాదరావు, సర్వేయర్ పి.రామ్‌మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి


తోటపల్లి ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ పి.విజయరమణి తెలిపారు. ప్రాజెక్టులో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 4 లక్షల చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మొదట విడత 6 లక్షలు, రెండో విడత 4 లక్షల చేప పిల్లలను విడుదల చేశామని చెప్పారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాజెక్టుల్లో అవసరమైన చేప పిల్లలను విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగిలో చేప పిల్లల పెంపకం కేంద్రం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, ప్రాజెక్టు డీఈఈ టి.రఘునాథనాయుడు, ఏఈఈ బి.కిషోర్‌కుమార్, మత్స్యశాఖ సిబ్బంది శ్రీకాంత్, శ్రీదేవి, గోపికృష్ణ, గిరిజన సంఘ అధ్యక్షులు ఈదల తిరుపతిరావుతో పాటు తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు మరడాన నారాయణస్వామి, బి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం ఎస్‌ఐకి ఎస్పీ ప్రశంస



ఎస్‌ఐ ప్రసాదరావును ప్రశంసా-పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

రామభద్రపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు సేవలను ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన క్రైం మీటింగ్‌లో ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి, సత్కరించారు. ఈనెల 13వ తేదీన భారీ ఎత్తున తరలిస్తున్న గంజాయిని పట్టుకోవడంలో ప్రసాద్ చాకచక్యంగా వ్యవహరించారని, అలాగే శనివారం తెర్లాం వద్ద కారుతో అక్రమంగా తరలిస్తున్న గంజాయి కేసును ఛేదించడంలో కీలకపాత్ర వహించారని తెలిపారు. అలాగే గంజాయి పట్టుకోవడంలో తోడ్పడిన ఇదే స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బాలి విశ్వేశ్వ రరావు(విస్సు)ను కూడా ప్రశంసా పత్రంతో సత్కరించారు. వీరిద్దరికి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కె.నారాయణరావులు అభినందించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


వైభవవేంకటేశ్వర స్వామి ఆలయంలో..

బొబ్బిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో గల పలు దేవాలయాల్లో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం, కంచరవీధి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, సింగారపువీధి వైభవవేంకటేశ్వరస్వామి, అగ్రహారం వీధి ఆంజనేయస్వామి, పాత బొబ్బిలి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతిరోజూ సాయంత్రం ప్రముఖ ప్రవచనకర్త, ఉభయవేదాంత తూపురాణి పద్మావతి పాశురాలపై ప్రవచనాలు చేస్తున్నారు.

షెల్టర్ ఉన్నా తప్పని అవస్థలు

- నిరుపయోగంగా విశ్రాంతి భవనం
- రోడ్డుపైనే విద్యార్థులు, ప్రయాణీకుల నిరీక్షణ


నిరుపయోగంగా ఉన్న బస్సుషెల్టర్


బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న విద్యార్థులు

భామిని, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొన్ని చోట్ల బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడడం మనం చూసి ఉంటాం.. కానీ ఇక్కడ షెల్టర్ ఉన్నప్పటికీ రహదారిపై ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. నిలబడ లేక.. కూర్చోలేక వాహనాల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇదీ భామిని మండల కేంద్రంలోని పరిస్థితి. భామినిలో ప్రయాణికుల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో ఏపీఎస్ ఆర్టీసీవారు బస్సు షెల్టర్ నిర్మించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. అటు వైపు బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికులు ఆ నిర్మాణాన్ని ఉపయోగించడం లేదు. దీంతో ఆ నిర్మాణం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యింది. విద్యార్థులు, ప్రయాణికులు రోడ్డుపైనే వాహనాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. శ్రీకాకుళం నుంచి బత్తిలి వరకు ప్రతి 30 నిమిషాలకు రెండు వైపులా బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక వేళ బస్సులు ఆలస్యమైతే ప్రయాణికులు నిలబడ లేక అవస్థలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా విశ్రాంత భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని ప్రయాణికులు కోరుతున్నారు. పెద్దదిమిలి, ఘనసర, గురండి, బత్తిలి పరిధిలో ఉన్న భవనాలు కూడా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.● దీనిపై పాలకొండ ఏపీఎస్ ఆర్టీసీ డీఎం పి.వెంకటేశ్వర్ వద్ద ప్రస్తావించగా త్వరలోనే భామిని విశ్రాంతి భవనాన్ని మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకు వస్తామని చెప్పారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం/పాతపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలంలోని కొరసవాడ వద్ద ఎమ్మెల్యే గోవిందరావు తనయుడి వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో గాయపడిన భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన సీహెచ్ జోగయ్య చికిత్సపొందుతూ మంగళవా రం మృతిచెందాడు. ఎస్‌ఐ లావణ్య కథనం మేరకు.. పాతపట్నం మండలంలోని కొరసవాడ వద్ద ఈనెల 21న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో భామిని మండలానికి చెందిన సీహెచ్ జోగయ్యతో పాటు మరో నలుగురు తీవ్ర గాయపడిన సంగతి తెలిసిందే. క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స కోసం చేర్పించారు. అయితే వీరిలో జోగయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రిమ్స్ నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పాతపట్నం సీఐ రామారావు, ఎస్‌ఐ లావణ్య ఆసుపత్రికి చేరుకు న్నారు. జోగయ్య కుటుంబ సభ్యుల వద్ద రిపోర్టు తీసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

రామభద్రపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యుల ఉసురు పోసుకుంటోందని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆరోపించారు. మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 27న వైసీపీ చేపట్టనున్న పోరుబాట పోస్టర్‌ను ఈసందర్భంగా ఆవిష్కరించారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ● సాలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలపై వరుసగా రెండు నెలల నుంచి కూటమి ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ చార్జీల భారంపై ఈనెల 27న ఏపీఈపీడీసీఎల్ డీఈఈకి వినతిపత్రం ఇచ్చేందుకు వైసీపీ శ్రేణులు తరలి రావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉన్న వైసీపీ నేతలు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు. ● పాలకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 27న ఆ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం పాలకొండలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పోస్టర్ ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ కనపాక సూర్య ప్రకాష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జీఎంఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే బేబీనాయన


జీఎంఆర్‌కు పులుల చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావును బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంఆర్ జన్మస్థలమైన రాజాం ఒకప్పుడు బొబ్బిలి సంస్థానంలో అంతర్భాగంగా ఉండేదని, అప్పట్లో ఆయన బొబ్బిలి రాజా కళాశాలలో చదువుకున్నారని, ఈసందర్భంగా తన అనుభవాలను పంచుకున్నారని బేబీనాయన తెలిపారు. బొబ్బిలి ప్రాంతంతో పాటు రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి జీఎంఆర్ సలహాలు అందించారన్నారు. వన్యప్రాణుల సంరక్షణా కేంద్రంలో తాను స్వయంగా తీసిన ఫొటోను జీఎంఆర్‌కు అందజేసినట్టు బేబీనాయన తెలిపారు. బొబ్బిలి ప్రాంతాభివృద్ధికి తన వంతు సహకారం అందివ్వాలని కోరానని ఎమ్మెల్యే చెప్పారు.

డిప్యూటీ ఈవోగా రవిప్రసన్నకుమార్

సీతంపేట రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఈవో కె.రవి ప్రసన్నకుమార్ చెప్పారు. పదోన్నతిపై సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ ఈవోగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అందరి సహకారంతో గిరిజన విద్యా ప్రమాణాల మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ముసురుమెల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన తాను పదోన్నతిపై ఇక్కడకు వచ్చినట్టు చెప్పారు. రవిప్రసన్నకుమార్‌ను సీనియర్ హెచ్‌ఎం పి.నారాయుడు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు అభినందించారు.

పీసా చట్టంతో స్వయంపాలన


మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంప్రసాద్

సీతంపేట రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీసా చట్టాన్ని షెడ్యూల్డ్ ప్రజలకు స్వయం పాలనను నిర్ధారించడానికి రూపొందించారని డీఎల్‌పీవో రాంప్రసాద్ తెలిపారు. పెస దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పెస చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా పీసా గ్రామసభ అనుమతి తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపీడీవో కె.గీతాంజలి, సివిల్ సప్లై డీటీ మధు, ఆర్‌ఐ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.



కొండలను తాకేలా..

- ఏవోబీలో కనువిందు చేస్తున్న మేఘాలు

సాలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలోని ఏవోబీలో రూఢికి వెళ్లే దారిలో మంగళవారం కొండలను తాకుతూ మేఘాలు కనువిందు చేశాయి. చుట్టూ ప్రకృతి అందాలతో పాటు కొండలపై కదులుతున్న కారుమబ్బులు వీక్షకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

కళ తప్పిన ఇళ్లు

(ఐదో పేజీ తరువాయి)

ముగియడంతో బ్యాంకులకు రుణాల చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఒక్కో లబ్ధిదారుడు రూ.4 వేలకు తగ్గకుండా ఈఎంఐలు చెల్లించాలి. దీంతో లబ్ధిదారులు చాలా బాధపడుతున్నారు. వీలైనంత త్వరగా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని.. మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

టిడ్కో ఇళ్లకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపాం. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు రూ.129 కోట్లు అవసరమని గుర్తించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

-శశిధర్, టిడ్కో డీఈఈ, విజయనగరం

ఆశ వదులుకోవాల్సిందేనా?

(ఐదో పేజీ తరువాయి)


భోగాపురం: రాజాపులోవలో నీటిలో ఉన్న వరి పనలను బయటకు తీస్తున్న రైతు

బాగుందనుకున్న సమయంలో రెండు వారాలుగా వరస తుపాన్‌లు వస్తున్నాయి. ఇంకా సగం పంట పొలంలో వుంది. కొన్ని ప్రాంతాల్లో వరి కుప్పలు నానడంతో మొలకలు వస్తున్నాయి. వీటి పరిస్థితి ఇలా వుంటే పెసలు, మినుములు కూడా దక్కే అవకాశం కనిపించడం లేదు.

● వరి కోతలకు రెండు రోజుల ముందు పెసలు, మినుమల విత్తనాలు చల్లారు. వ్యవసాయ శాఖ 4081 హెక్టార్లలో పెసలు, 10067 హెక్టార్లలో మినుమ విత్తనాలు వేసినట్లు చెబుతోంది. వరి పంట వున్న ప్రతి పొలంలోను ఈ పంటలు పండిస్తారు. వరి ద్వారా పొందని ఆదాయాన్ని పెసర, మినప పంటల ద్వారా ఆశిస్తారు. కానీ వర్షాలకు నేడు దిగాలు చెందుతున్నారు.

నీటిలోనే వరి

భోగాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో చేరిన వరదనీరు తగ్గడం లేదు. చిరు జల్లులు కొనసాగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. భోగాపురం మండలంలోని రాజాపులోవ, చెరుకుపల్లి, పోలిపల్లి, లింగాలవలస ప్రాంతాల్లో పంట పొలాలను వరద నీరు వీడడం లేదు.

న్యూస్ బాక్స్

ఖాళీగా హౌసింగ్ ఏఈ పోస్టు

రామభద్రపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు నెలలుగా హౌసింగ్ ఏఈ పోస్టు ఖాళీ అవ్వడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్ బిల్లులతోపాటు కొత్త గృహాల నమోదు, ఇతర కార్యకలాపాలు నిలిచిపోయాయని వాపోతున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి అధికారిగా ప్రస్తుతం బొబ్బిలి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. పర్మినెంట్ ఏఈని నియమించాలని కోరుతున్నారు.

గోశాలల నిర్మాణం పూర్తి చేయాలి

సీతానగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా మొదటి విడతగా 24, రెండో విడతగా 26 గోశాలలు మంజూరు చేసినట్టు ఎంపీడీవో పి.త్రివిక్రమ్‌రావు తెలిపారు. కాశీపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోశాలలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన గోశాలలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. రెండో విడతలో సూచించిన గోశాలల స్థలాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించండి


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

వీరఘట్టం, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌ను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు మంగళవారం పరిశీలించారు. వార్షిక రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ జి.కళానిధి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతాడ గ్రామం నుంచి రాముడువలస మీదుగా పక్కి గ్రామానికి 80 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని ఎస్‌ఐ రమేష్ పట్టుకుని అరెస్టు చేసినట్టు ఏఎస్‌ఐ భాస్కరరావు మంగళవారం తెలిపారు. పక్కి గ్రామానికి చెందిన శంబంగి కలవల అప్పలనాయుడును పట్టుకుని, అతని వద్ద గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వర్షంలోనూ వాహన తనిఖీలు

సాలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జోరు వర్షంలోనూ సాలూరు రూరల్ ఎస్‌ఐ నర్సింహమూర్తి వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయన తన సిబ్బందితో మంగళవారం మామిడిపల్లిలో వాహన తనిఖీలను నిర్వహించారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

బాడంగి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 51 క్యాటల్ సెట్స్‌ను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే పల్లె పండుగలో వచ్చిన పనులను ఎక్కడా ఎటువంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. వీటితోపాటు ఫిష్ పాండ్స్‌ని, ఫారం పాండ్స్‌ను గుర్తించాలని, ప్రతి గ్రామంలో అగ్రికల్చర్ అసైన్ వర్కుని గుర్తించి పని కల్పించాలని సూచించారు. పని పూర్తయిన వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గంతో ఎంపీడీవో

వీరఘట్టం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా టి.సుధాకర్, అధ్యక్షుడిగా ఎ.బంగారుబాబు, కోశాధికారిగా చక్రధరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.